

ఏం తోచకుండా వుంది !
ఈ కిటికీ ఇనపగజాలు
రాళ్ళగీసినట్టు అడ్డుగా ఉన్నాయి
మా ఇంటి కిటికీలకి నిలువుగా ఉంటాయి



మా ఇల్లు మా తాతయ్యది మా తాతతండ్రి కట్టించింది వాళ్ళ ఊహాలూ జీవితాలూ నిటారుగా ఉండేవికాబోలు – పొలంగట్ల మీద తాటిచెట్లలాగ నిట్టనిలువుగా ఈ కిటికీతలుపులు అవతలికి ఉన్నాయి మా యింటి కిటికీతలుపులు లోపలికే ఉంటాయి మూసేయాలంటే గభాల్న మూసుకోవచ్చు ఈ కిటికీ మూయాలంటే అడ్డుచువ్వల్లో చేతులు దూర్చి రెక్కలు లోపలికి లాక్కోవాలి రోడ్డుమీంచి ఎవరేనా మూసేయనూవచ్చు మూడు మైళ్ళనుంచి చువ్వలరూళ్ళు దాటివస్తున్న కడలిగాలిగి కాలరు టపటపమని మెడ దగ్గిర చక్కిలిగింతలు చేస్తూంటే చిన్నప్పుడు అలిగి మూతిముడుచు కూర్చున్న అమ్మికి నేను గిలిగింతలు పెట్టడం – ముసిముసి నవ్వుతూ అమ్మి రక్కున తలవంచి బిగించినప్పుడు అమ్మిమెత్తటిమెడకింద ఇరుక్కున్న నా వ్రేళ్ళకి సన్నజాజి నెక్లేస్మొనలు గిలిగింత పెట్టడం ఛురకవేఎనట్టు జ్ఞాపకం వచ్చింది అమ్మి పూర్తి పేరు చిన్నమ్మి వాళ్ళమ్మ దాన్ని అమ్మి అనే ఎల్చేది మా వీధిచివార్నుండేది వాళ్ళిళ్ళు ఆ ఇంటికి అవతల పెద్ద చింతచెట్లూ వెదురుపొదలూ తప్ప మరేవీ ఉండేవి కావు ఎండవేళ వాటి నీడల్లో చిన్నమ్మీ నేనూ ఆడుతూపాడుతూ తిరిగే వాళ్ళం–ఎవీ తోచకపోడమంటే ఎంటో తెలీని ఆ రోజుల్లో

మా అమ్మ వాళ్ళింటికి వెళ్ళొద్దనేది అమ్మితో ఆడొద్దనేది వాళ్ళు మంచివాళ్లు కారట ఆ ఇంట్లో ఇద్దరే ఉండేవారు అమ్మీ వాళ్ళమ్మాను ఎవరు మంచివాళ్ళు కారో ఎందుక్కారో నాకు తెలిసేది కాదు చిన్నమ్మి అమ్మ మంచిదికాదు!– అనేది అమ్మ – అంతే

...మరి మామయ్య వాళ్ళింటికి వెళ్తూనేఉండేవాడు. మొదట వాళ్ళింటికి మామ తీసుకెళ్తేనే వెళ్ళాను. అమ్మిని నన్నూ ఆడుకోమని చెప్పిందీ మావయ్యే!...మావయ్య ఆ ఇంట్లో పుస్తకాలు చదువుతూనో, ఏదో రాసుకుంటూనో, అమ్మిని ఒళ్ళోకూచోబెట్టుకొని ఆడిస్తూనో కనిపించేవాడు......అందుకేనేమో మామను ఇంట్లో అదొకలాగ చూస్తూండేవారు — తాతయ్య భలే కోపంగా — ఏడుస్తున్నట్టూను ఉండేవాడు.

అమ్మిఅమ్మ నాకేమో చాలా మంచిది! మంచి సన్నటి తెల్లటి చీరలు కట్టేది — నల్లటి కొప్పు — జారిపో తున్నట్టు — మల్లెదండలు పెట్టుకొనేది. వాళ్ళింటి కెళ్ళినపుడల్లా తినటాని కేవో పెట్టేది — దగ్గిర్నా కూర్చోబెట్టుకొని కథల్లాంటివి చెప్పేది. వాట్ని కథలనే చెప్పేది అమ్మి నేనూ వింటూన్నంత సేపు వినేవాళ్ళం. — అమ్మా, తాతయ్యా కూడా కథల్చెప్పేవాళ్ళు. దేముళ్ళూ రాక్షసులూ, రాజుకొడుకులూ, మాయలు మహిమలు కథల్నిండా ఉండేవి. భూతాల కథలు మరీ బాగుండేవి — అమ్మిఅమ్మ చెప్పే కథలు అలా ఉండేవికావు ; — అంతా మనుషులే; వాళ్ళు చేసే పనులు, తెలివితేటలు, తెలివితక్కువలు — అవీ ఉండేవి. అన్నీ తాను చూసినట్టు చెప్పేది — అంచేత అవి కథల్లాగా ఉండేవికావు. అబద్ధాల్లాగా ఉండేవికావు; ఒకటి మాత్రం బాగా తెలిసేది; తెలివి తక్కువవాళ్ళు మంచివాళ్ళైనా లాభం లేదని...కొన్ని కథల్లో మనుషులు మనుషుల్నే చెడ్డబాధలు పెడుతూండే వారు; కొన్ని కథలు వింటూంటే ఏడుపొచ్చేసేది; అలాంటి కథల్ని చెప్పొద్దనే వాళ్ళం. అయినా చెబుతూనే ఉండేది. వినేవాళ్ళంకాదు; అయినా ఆగేదికాదు. నవ్వించే కథలూ చెప్పేది. అసలవి కథలే కావేమో, ఎన్నిసార్లు చెప్పినా కొత్తగానే ఉండేవి — అంత వేగంగా వాట్ని మర్చిపోయేవాళ్ళం...అమ్మా తాతా చెప్పేకథల్లో హింసలు పెట్టేవాళ్ళని ఏడిపించేవాళ్ళని రాక్షసులంటూ చెప్పేవాళ్లు- అమ్మిఅమ్మ వాళ్ళని మనుషులనేచెప్పేది.

అమ్మివాళ్లుండేది, —మా యింటి లాగ పెంకుటిల్లేం కాదు — చుట్టూరా బొమ్మ జెముళ్లూ, తీగలూ అల్లుకొన్న దడి, వెదుళ్ళ తడికె తలుపుతో చిన్న గేటు, అందులో పెద్దమల్లె పందిరి, పందిరి కెదురుగా చిన్న పూరిల్లూ, పచ్చమన్ను అలికిన గోడలు, జేగురు గడపలు, వాటి మీద సున్నంతో వేసిన చారలూ, ముగ్గులూ, చుట్టూరా రంగు రంగు పూల మొక్కలు, బంతిచెట్లూ, — ఆ బంతి పువ్వుల రంగు యిప్పుడూ కళ్ళలో మెరుస్తున్నట్టే ఉంది—...వాళ్ళింటి కెళ్లి నప్పుడల్లా తాతయ్య రామాయణంలోదో, శకుంతలదో పర్ణశాలలూ అవీగుర్తొచ్చేవి. లేళ్లూ, నెమిళ్ళూ లేవుగాని — తోకాడిస్తూ

ఎదురొచ్చే మచ్చల కుక్కా దాని పిల్లలూ ముద్దుగా ఉండేవి. చింత చెట్ల మీద, వెదురు పొదల్లోనూ పక్షులు కలకల మంటూండేవి.

ఆ ఇల్లు కెదురుగా పెద్దచింతమాను, మొదట చేతులువిరిగిపోయిన రాతి బొమ్మ ఉండేది. ఆ బొమ్మ ఒళ్ళో పాపాయి లాంటి చిన్నబొమ్మ సగం సగం ముక్కలూడిపోయినట్టుండేది. సాయంకాలాలవేళ అమ్మిఅమ్మ చిన్న ప్రమిదతో దీపం తీసుకెళ్ళి ఆ బొమ్మ దగ్గిరుంచేది; ఎందుకని అడిగితే — ఆ బొమ్మ వేపే రెప్పలార్పకుండా చూస్తూ — ఆ బొమ్మ, ఆ దీపం వెల్తురు చూడ్డాని కెంతో బాగుంటుందని కాస్సేపటికి చెప్పేది. అమ్మికూడా అపుడపుడు దీపం తీసుకెళ్ళి పెట్టేటప్పుడు నేనూ కలిసి వెళ్ళేవాణ్ని. మరెవరూ దీపం పెట్టేవారు కారుగాని ఆ బొమ్మ ముక్కూ మొహం కనపడకుండా పసుపుముద్దలూ, కుంకం మెత్తేసి ఉండేవి. అమ్మిఅమ్మ అలాంటి పనిచేయడం నే చూళ్లేదు. ఆ బొమ్మ ఏమిటని అడిగితే 'అమ్మ' అని చెప్పేది అమ్మిఅమ్మ మా అమ్మ చెప్పేది ... ఆ బొమ్మ ఒక అమ్మోరిదట! ఆ అమ్మ వారి పేరు 'చింతలమ్మ' అని.

*　　*　　*

మామయ్య కేదో జ్వరంవచ్చి వారం రోజులైనా తగ్గలేదు. ఒకనాడు మామయ్య మాంఛి ఊష్ణంలో ఉన్నప్పుడు అమ్మీ! అమ్మీ! అని పిలవటం నాకు గుర్తుంది — అది పలవరించటం అట! అలాంటప్పుడే తాతయ్య ఎవర్నో కసురు తూన్నట్లు వినిపిస్తే వెళ్ళి కళ్ళంట నీళ్ళు పెట్టుకొంటూ మా ఇంటి గుమ్మందిగి వెళ్ళిపోతూన్న అమ్మిఅమ్మను చూచాను. వెంట అమ్మి కూడా ఉంది. "అమ్మీ! మావయ్య పిలుస్తున్నాడు, రా!..." అని నేను పిలుస్తూండగానే తాతయ్య వీధి తలుపులు మూసేస్తూంటే అదో జాలిగా కనిపించిన అమ్మి బిక్కమొహం నా కిప్పటికీగుర్తే ...అదే అమ్మి కనిపించడం ఆఖరుసారి ఔతుందని అనుకోలేదు —

మామయ్య చచ్చిపోయాడు.......

నాల్రోజుల తరవాత వాళ్ళింటికి వెళ్లాను — ఎవరూ కనిపించలేదు. మల్లిపందిరికింద తడిలేదు — మేకలు మొక్కలు కొరుకు తూంటే కుక్క అరుస్తోంది...అమ్మి వాళ్ళమ్మా ఎక్కడికో వెళ్ళిపోయారట! — మరి రారుకూడానట!!

మామయ్యబీరువానిండా పుస్తకా లుండేవి — చెద కనిపించిందట — తరాజూ గుళ్లూ తెచ్చి ఒకడెవడో వాటిని గోనె సంచిలో వేసుకొనిపోయాడు.

అమ్మి వెళ్ళిపోయాక — ఏమీ తోచక పోవడమనేది తొలిసారిగా తెలిసింది. ఎండ వేళల్లో ఆ చెట్లూ, పొదల మొదల నీడల్లో నిల్చుని ఎదురుగా ఎండిపోతూన్న మల్లిపందిర్నీ, జేగురు గడపలమీద రాలి పోతూన్న ఇంటికప్పునీ చూసి చూసి —

చేతుల్లేని రాతిబొమ్మముఖంమీద పెచ్చులు కట్టిన పసుపు ఊడలాగి వచ్చే సేవాణ్ణి...

ఏడాది కిందట—మా తాతలనాటి ఇంటి పెణక కూలి వీధిగోడా, ద్వారమూ పడిపోయాయని విడిచిపోతున్న అద్దెకున్న వాళ్ళుత్తరం రాస్తే ఆ ఇంటిబెడద పూర్తిగా వొదిలించుకోడానికని మా వూరెళ్ళాను — అక్కడ ఆ వూరిగుడిసె ఉండకపోయినా, ఆ చెట్లుగాని పొదలుగాని మచ్చుకైనా లేవు—ఇళ్లూ మేడా ఒక మిల్లూ,—ముఖ్యంగా తెల్లగా సున్నంవేసిన ఒక గుడీ కనిపించాయి. అది చింతలమ్మవారి గుడి అట. చింతల్లుతీర్చే అమ్మతల్లిట. చింతలమ్మోరు మహా(మహత్తెం, సత్తెంగల అమ్మోరట. ఆ గుడి ఉన్నచోటే చింతమాను మొదట వెలిసిందట; — గుడి లోపలికెళ్ళి చూస్తే పెద్ద కత్తీ, కుంకంభరిణె పట్టుకొని భీకరంగా వార్నిష్ రంగుల్తో పెద్ద సిమెంటువిగ్రహం కనిపించింది!...గుడినుంచి బయటికొస్తూంటే ఎదురుగా ఒక వేప చెట్టూ,చుట్టూ సిమెంటు చప్టా చెట్టు మొదట పెద్ద కత్తి, వసంతకంలో కడగని రక్తం మరకలూ - కొన్ని మూగజీవాలు కనిపించాయి



తర్వాత తెలిసింది-ఆ చేతుల్లేని రాతిబొమ్మని పురావస్తు పరిశోధన శాఖవారు తీసుకుపోయారట, మ్యూజియంలో భద్రంగా ఉందట; ఇక్ష్వాకులనాటి బౌద్ధశిల్పం, బుద్ధ భగవానుణ్ణి ప్రసవించిన మాయాదేవి విగ్రహమట అది!... ఆ బొమ్మ -ప్రమిద దీపమూ-'అమ్మ'-

అమ్మ...అన్నీ కడలిగాలిలో కరిగిపోతున్నాయి — మళ్ళీ ఏం తోచకుండా ఉంది... ఏమీ తోచడంలేదు...కదవస్తే యిప్పుడెంత బాగుండును! ఎంతబాగుండును!!... ప్చ్...ఆమె రాదు...ఆమె కనిపించదు!!

...ఇలాగే యీ అద్దుచువ్వల దగ్గిరీలాగే — ఏమిటి చూస్తూ నిల్చున్నానో తెలియని యీలాంటి ఏమీ తోచని వేళల్లోనే ... మల్లెల ఘాటు తగిలి ఉలికిపడి తేరిచూసినప్పుడు... వొదులొదులుగా తరంగాల్లా ఎగిరే పట్టులాంటి సగం అల్లి వదిలేసిన కొప్పు, శరన్మేఘమాలికల్లా ఆ కొప్పులో తలలు దాచుకొని ఉయ్యాల లూగే జాజిమల్లెలూ, రెపరెపలాడే చీరచెంగూ కనిపించి మాయమయ్యేవి, — తరుణుల వెనుతట్టునే ఆశ్రయించి ఉంటాడుట మన్మధుడు విల్లెక్కుపెట్టి; ఆమెను ఎదురుగా చూడాలని నాకుండేదిగాదు, నే చూడని ఆమెవదనం ఎంతో సుందరం! చూస్తే తగ్గిపోతుందని నాకు భయం!

ఓసారి కిటికీరెక్కలు మూసుకొని ఉంటే, గట్టిగా త్రోశాను—అవతల ఎవరో పాపం అనుకొని ఉన్నట్టుంది... తలుపులు తెరుచుకున్నాయి... అవే పూలు! అవే కురులు! ఆమే!! వెళ్ళిపోతూ కొంచెం తిరిగిచూసింది — ఆ ముఖాన్ని — ఆమెను చూడటానికి అదే మొదలు......ఆ తర్వాత ఎన్నోసార్లు, ఎన్నోసార్లేమిటి — ప్రతిసారీ ఆ ముఖాన్ని — ఆమెను చూస్తూ, చూడకపోతే ఏం తోచకపోతూను...



ఒకనాడు పేరేమిటో అడిగాను... నాకు ఇష్టమైన దేమైనా ఉంటే అదే ఆమె పేరట!

''కథ అంటే నాకు మహాయిష్టం..'' అన్నాను.

"అదే నా పేరు – కథ అనే పిలు" అంది.

''ఛా...కథ అని ఎక్కడేనా పేరు వుంటుందా ? "

"ఎందుకుండదూ ? ఉంటుంది ! కథ అంటే తనకు యిష్టం అనుకునే వారున్నప్పుడు 'కథ' అన్న పేరు గలదీ ఉండి తీర్తుంది" అంది – అంతే మరేమీ మాట్లాడుకోలేదు.

మళ్ళీ మరొకసారి – కథకూ నాకూ అడ్డుచువ్వలు తప్ప మరేదీ మధ్య లేనప్పుడు, "నాతో ఉండిపోగూడదూ?'' అనడిగాను.

"నేను కథని తెలుసా ? !...కిటికీ చువ్వల కివ్వలేగాని - అవ్వల ఆలోపల ఉండలేను !'' అంది.

"నేను కథలు రాస్తాను తెలుసా ?" అన్నాను.

''తెలీకేం ;...చువ్వల కవ్వల, నీ లోపల రాస్తావు – కథలని; నీవి అవ్వలి కథలు – నేనో, యీవలి కథను !...'' అంటూ విసురుగా వెళ్ళిపోయింది.

*   *   *

అనుకోకుండా ప్రయాణం – రైలు దిగుతూంటే ప్లాట్‌ఫారంమీద కనిపించింది కథ! పచ్చి నెత్తురురంగు చీర కట్టుకుంది, అంచు లూ మైజారూలేని చీర–పడమటి సాంధ్యరాగం పడి మరీ ఎఱ్ఱగా మెరిసిపోతోంది ... ఎరుపు రంగంటే ఆరోజుల్లో నాకు మరీ యిష్టంగా ఉండేది; ఎర్రసిరాతో రాసేవాణ్ణి కథలు; – ''మీ కథలకి ఒక ప్రత్యేకత ఉంది! కట్టలుకట్టలుగా ఉన్న కథల్లో ఎఱ్ఱగా కొట్టొచ్చేట్టు కనిపించే మీ కథల్ని ఇట్టే ఏర్చిపారెయ్యగలం !'' అని ఒక సంపాదక మహాశయుడు అన్నమాటలు యిప్పటికీ పొడుస్తూనే ఉంటాయి–జాతీయాభిమానం పుట్టుకొచ్చి కరక్కాయ సిరాతో, రాత బాగా సాగకపోతే–ఇండియన్ ఇంకుతో– తర్వాత నలుపురంగు సిరాతో రాశాను. ఆకుపచ్చమీద సరదా పుట్టి పచ్చసిరాతో రాశాను; నీలంరంగు సిరాసంగతి వేరే చెప్పనక్కర్లేదు. అన్ని రంగుల కాగితాలమీదా వ్రాశాను. పసుపు రంగు కాగితాల ఆకుపచ్చ సిరాతో రాసిన కథ లందుకొని ఒక పత్రికాయన అవేవో శుభలేఖ కాయితాలని ఊరుకున్నాడట– పసుపుకాగితంమీద ఎఱ్ఱసిరాతో రాసిన కథని కథాముత్తైదువు అన్నాడొకాయన, ఇంద్రధనుస్సని పేరు మార్చాడో సంపాదకుడు తెల్లకాగితంమీద అన్నిరంగుల సిరాలతోనూ రాసిన ఒక కథకి – ఇహ రాయందల్లా తెల్లరంగు సిరాతో-నల్లటి కాగితంమ్మీద–తెల్లటి అక్షరాల్తో ఎప్పుడో



ఒకప్పుడు రాసుకోక తప్పదు — ఆత్మ కథను—ఎవరికైనా

ఇప్పు డిక్కడే ఉంటున్నాను— ఆ ఫ్యాక్టరీలో నవ్వుతూన్న లేగులాబి పెదిమల్తో చెప్పింది కథ — అంతకంటె ఎక్కువ నేను వినదల్చుకోలేదు ఆమె చెప్పనూ లేదు

* * *

కొన్నాళ్ళకు—అడ్డుచువ్వ లవతల కథ మళ్లా కనిపించింది వొచ్చేశాను అంటూ రక్తం ముద్దల్లాంటి ఎఱ్ఱటి పెదిమెలు మెరిసేలా నవ్వుతూ బజార్లోని టాయిలెట్ మేకప్ సామగ్రి అంతా ఆమె ఒంటిమీద ఉంది నైలాన్ పొరలు సముద్రాల్లాగ చుట్టుకుని ఉన్నాయి ఆ పొరల్లో ల ఆమె శరీరం ఉందో లేదో అనుమానం రెండుచేతులాపట్టి నలిపి ఉండచుట్టి వేయాలన్నంత వెర్రులెత్తించే టట్లుంది—సినీమా ఛాన్సు దొరికిందట పునర్జన్మ ఎత్తినట్టుందట ఆమెకి ! అంతే తర్వాత ఆమె మరి కనిపించలేదు

ఒకనాటి చీకటి వేళ కనిపించింది—పెద్ద ప్రహరీలో ఉద్యానవనం మధ్య అందాల మేడ అద్దాల కిటికీల వెనుక ధగధగలాడే వెలుగులో కనిపించింది ! ఆశ్చర్యం వేసింది—ఆ అద్దాల కత్తెరల్లో ఆ లోపలి ఎలా ఉండగలుగుతున్నది ! అని—ఎందు కుండదూ ? విలాసమూ డబ్బూ అంతు లేని కీర్తి నాతో ఉండిపోమంటే ఎందు కుంటుందీ ? నాతో ఏముందని ?— పేజీకి రూపాయి వెయ్యి నయాపైసాల కథా రెండువేల నపై కథా మహా అయితే నాలుగువేల నయాలు ఇంతేగద !

బహుమతు లెక్కువగా రచయిత్రులే కొట్టేస్తున్నారు...

కథ యిూదారి మరి రాదు — ఈ అడ్డు ఊచ లవతల ఆమె మరి కనిపించదు! కిటికీ దగ్గరకెళ్ళడమే మానుకున్నాను, కడలిగాలి మర్చిపోయి చాలాకాలం దొర్లింది... మళ్ళీ ఈవాళ ఎందుకో నాలో బలంగా కిటికీదగ్గర నిల్చోవాలని బుద్ధి పుట్టింది! ......కడలి గాలి మందగించి పోయిందే!, కాటుకలో చుక్కలు గింజుకుంటున్నాయి. చాలా రాత్రయిందే!... ఏఁవిటో...చువ్వలవతల చీకట్లో నీడలాగ ఆమె కనిపిస్తున్నట్టే ఉందే!' ...... ఏంటో...రెక్కలులాగి మూసుకున్నాను.

బయటి గోలకి తెలివొచ్చింది. కిటికీ తెరిచాను. గుంపులు గుంపులుగా వెళ్తున్నారు — అదే?...తెల్లవార్తోంది.. రోడ్డువార నాలుగైదు గొంతులు వినిపిస్తున్నాయి.

"అదిగో ఆ ప్రహరీ లోపలే..."

"చాలా అందమైన మనిషేనట?..."

"మనిషేంటయ్యా?!...చుక్కలాంటమ్మాయ్!..."

"ఏదైతేనేం — చిత్రవధ...! ముక్కలు ముక్కలు..."

"షటప్! ఎవరూ హత్య చెయ్యలేదట — ఆ అద్దాల కిటికీల్లోంచి దూకడంలో

ఛిన్నాభిన్నమైపోయి పడిందట—ఆత్మహత్య చేసుకుంటూన్నట్టు రాసిపెట్టి మరీ..."మరి ఉండబట్టలేక కిటికీచువ్వల్లో నోరుపెట్టి గట్టిగా అరిచాను, "ఎవరూ ? కథా ? చిత్రవధ అయిపోయిందా ! ఆత్మహత్య చేసుకుందా కథ ? ! !''

''కథేమిటయ్యా ?—నీ పైత్యం ! దానియిప్పటి పేరు కళ' — అసలు పేరు 'చిన్నమ్మి' అట; అలాగే చేర్వాలు పెట్టింది. వాళ్ళది, అదేదో'—',ఆఊరట మొదట".

ఆఁ ! మా ఊరే ! ! చిన్నమ్మి ! అమ్మి ! కథ—అమ్మి !...
అబ్బా ! ! తల తిరుగుతోంది ......
చింతలమ్మ గుడి - మూగ జీవాలు - రక్తం మరకలు — అబ్బ ! ! ఏం తోచడంలేదు... ★